క్లుప్తంగా

మానవతా దృక్పథం చాటిన ఎస్‌ఐ రవీందర్



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్‌ఐ రవీందర్

మద్దిరాల : ఆత్మకూరు (ఎస్‌) మండల పరిధి లోని ఐలాపురం బ్రిడ్జి వద్ద లారీ బైక్‌ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళ్తున్న మద్దిరాల ఎస్‌ఐ ఏ.రవీందర్‌ గాయపడిన వ్యక్తిని తన వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించి మానవతా దృక్పథం చాటారు.

ఆర్చి నిర్మాణం

అర్వపల్లి : సోలిపేట –కుంచమర్తి రహదారిపై ఉయ్యాలవాడ గ్రామానికి వెళ్లే దారి మొదట్లో ఆర్చిని నిర్మించారు. పోరెండ్ల వీరయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పోరెండ్ల మధుబాబు–స్వాతిలు సుమారు రూ.2లక్షల వ్యయంతో ఆర్చిని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా దాత మధుబాబును సర్పంచ్‌ సాగర్ల బుచ్చయ్య, ఉపసర్పంచ్‌ సాగర్ల సుశీల సత్తయ్య అభినందించారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్‌ ర్యాలీ



తిరుమలగిరిలో బైక్‌ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తిరుమలగిరి : ఆజాదీ కా అమృత్‌ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పతాకాలతో ఆదివారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కడియం రామచంద్రయ్య మాట్లాడారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులను స్మరించుకోవడం సంతోషకరమన్నారు. వారి అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వై.ధీన్‌దయాళ్‌, ఎం.యాదగిరి, సీహెచ్‌.హన్మంతు, సోమయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి రూ.లక్ష ఎల్‌ఓసీ అందజేత

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకుడు కొండె బోయిన రామదాసు భార్య సోమక్క అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతోంది. ఆమె వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు అవుతున్నందున స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ సీఎం సహాయనిధి ద్వారా రూ.లక్ష ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు ఎల్‌ఓసీ కాపీలను ఆదివారం హైదరాబాద్‌లో బాధితురాలి కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల నాయకుడు పందిరి యుగేందర్‌, బాధితురాలి కుటుంబీకులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

కోదాడఅర్బన్‌ : పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) సంస్థలో పనిచేస్తున్న రిసోర్స్‌ పర్సన్స్‌ (ఆర్‌పీ)ల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి చలిగంటి ప్రమీల ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం పట్టణంలో మెప్మా ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆర్పీలకు ఇస్తున్న రూ.4వేల జీతం వారి కుటుంబానికి ఏ విధంగా సరిపోదని, కుటుంబం ఎలా గడుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే వారికి రూ.20వేల వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనాలు లేక ఇబ్బందులు

- చివ్వెంల మండలంలో అంగన్‌వాడీలకు పక్కా భవనాలు కరువు
- అద్దె ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగుతున్న కేంద్రాలు
- కొరవడిన కనీస సౌకర్యాలు



పిల్లలజెగ్గుతండాలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



లక్ష్మణ్‌నాయక్‌ తండా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న కేంద్రం

చివ్వెంల : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ చాలా కేంద్రాలను సొంత భవనాలు లేవు. అద్దె ఇళ్లలో, ఇరుకు గదుల మధ్య కేంద్రాలను నిర్వహించాల్సి వస్తోంది.

20 కేంద్రాలకే సొంత భవనాలు..

చివ్వెంల మండలంలోని మూడు క్లస్టర్ల పరిధిలో 72 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 20 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మరో 52 కేంద్రాలను ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని అదనపు తరగతి గదుల్లో, అద్దె భవనాల్లో నడిపిస్తున్నారు. సాధారణంగా ఒక అంగన్‌వాడీ సెంటర్‌లో వంటకు, పిల్లలు కూర్చునేందుకు, సామగ్రి నిల్వకు కలిపి కనీసం మూడు గదులు ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా ఈ సౌకర్యం లేదు. పలు చోట్ల కేంద్రాల్లో ఒక్కగది మాత్రమే ఉంటుందని సిబ్బంది వాపోతున్నారు.

అద్దె కష్టాలు..

అద్దెభవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు నెలకు రూ.వెయ్యి వరకు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది. దీంతో అదనంగా తామే చెల్లించాల్సి వస్తుందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. పైగా ప్రభుత్వం నుంచి ప్రతి నెలా నిధులు విడుదల కావడం లేదని, ఇంటి యజమానులతో మాటలు పడాల్సి వస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని సేవలు ఒకే చోట..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో పాటు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందించాల్సి ఉంటుంది. అద్దె భవనాల్లో ఒకే గది ఉండడం, అది కూడా ఇరుకుగా ఉండడంతో కేంద్రాల్లో సేవలు అందించడం ఇబ్బంది అవుతోందని సిబ్బంది అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



సొంత భవనాలు అవసరమున్న అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి, నిధుల మంజూరు కోసం ప్రతి ఏడాది ప్రతిపాదనలు పంపిస్తున్నాం. నిధులు మంజూరైతే సొంత భవనాలు నిర్మించవచ్చు. అద్దె భవనాల్లో ఉన్న ఒక్కొక్క కేంద్రానికి నెలవారి అద్దె ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో రూ.వెయ్యి చెల్లిస్తున్నాం. – శ్రీవాణి, సీడీపీఓ

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



సూర్యాపేట : విద్యార్థిని అభినందిస్తున్న మంత్రి

సూర్యాపేట : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌ రెడ్డి అన్నారు. సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామానికి చెందిన చప్పిడి కృష్ణారెడ్డి మనవరాలు పులగం సాధిక కొద్దిరోజుల క్రితం ఎంటెక్‌ (సీవీఆర్‌) కాలేజ్‌ హైదరాబాద్‌లో గోల్డ్‌ మెడల్‌ సాధించడంతో విషయం తెలుసుకున్న మంత్రి జగదీష్‌రెడ్డి ఆదివారం ఆమెను సూర్యాపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో సాధిక తండ్రి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు వై.వి, జిల్లా నాయకులు చిన్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీతాయణం పుస్తకం ఆవిష్కరణ



తుంగతుర్తి : సూర్యాపేటలో సీతాయణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీష్‌ రెడ్డి

తుంగతుర్తి : కవి, గాయకులు, వైతాళికులను సన్మానించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌ రెడ్డి అన్నారు. తుంగతుర్తికి చెందిన ఎర్ర హరికిషన్‌ రచించిన సీతాయణం పుస్తకాన్ని ఆదివారం సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీష్‌ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ కవులను, రచయితలను, గాయకులను, వైతాళికులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. అనంతరం ఎర్ర హరికిషన్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల చంద్రశేఖర్‌, రామలింగారెడ్డి, జలగం పురుషోత్తం, నాగరాజు, చంద్రశేఖర్‌, గుండగాని శ్రీనివాస్‌, చిత్తలూరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువకు బీఎన్‌రెడ్డి పేరు పెట్టాలి



బీఎన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాజేశ్వరిదేవి, తదితరులు

నాగారం : శ్రీరాంసాగర్‌ కాలువకు మాజీ ఎంపీ, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని ఆయన కూతురు రాజేశ్వరిదేవి అన్నారు. ఎస్సారెస్పీ కాలువ వద్ద భీంరెడ్డి నర్సింహారెడ్డి స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరుతూ బీఎన్‌ స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రజాకార్లకు ఎదురెళ్లి పోరాడిన యోధుడు, భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ ప్రజల విముక్తి కోసం నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు బీఎన్‌ రెడ్డి అని కొనియాడారు. బీఎన్‌రెడ్డి తన తుదిశ్వాస వరకు తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు శ్రీరాంసాగర్‌ నీటిని తేవాలని కృషి చేశారని గుర్తుచేశారు. బీఎన్‌ రెడ్డి చేపట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్‌ చేశారు. అనంతరం ఎస్సారెస్పీ కాలువ వద్ద బీఎన్‌రెడ్డి స్మృతివనం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రాంగణ ఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌ స్మారక కమిటీ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య, మల్లు కపోతంరెడ్డి, తాటికొండ సీతయ్య, తన్నీరు రాంబాబు, ఈదుల వీరపాపయ్య, సోమిరెడ్డి, యాదగిరి, కడెం మల్లయ్య, సుందర్‌రావు, భిక్షం, కరుణ, రహిమాన్‌, సైదులు, కొండల్‌ తదితరులు పాల్గొన్నారు.

12,978 దరఖాస్తులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్‌

అర్వపల్లి : గృహలక్ష్మి పథకానికి సంబంధించి తుంగతుర్తి నియోజకవర్గంలోని జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, తుంగతుర్తి, నాగారం, తిరుమలగిరి, నూతనకల్‌ మండలాలకు మొత్తం 12,978 దరఖాస్తులు వచ్చాయి. జాజిరెడ్డిగూడెం మండలంలో 1,667, మద్దిరాల మండలంలో 1,513, తుంగతుర్తి మండలంలో 2,873, నాగారం మండలంలో 1,203, తిరుమలగిరి రూరల్‌ 1,800, తిరుమలగిరి అర్బన్‌ 1,723 నూతనకల్‌ 2,199 దరఖాస్తులు వచ్చాయి.

ఇష్టారీతిన విస్తరణ పనులు

- ఆత్మకూరులో ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రధాన రోడ్డు
- అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు మధ్యలోనే గేట్‌ వాల్వ్‌
- అస్తవ్యస్త పనులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గేట్‌ వాల్వ్‌ గుంతలో దిగబడిన టాటా ఏస్‌ వాహనాన్ని నెట్టుతున్న వాహనదారులు

ఆత్మకూర్‌ (ఎస్‌) : ఆత్మకూరు మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన కొన్ని పనులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అస్తవ్యస్త పనుల కారణంగా పలుచోట్ల వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం చోటు చేసుకుంటుంది. ఆత్మకూరు బస్టాండ్‌ నుంచి ఎస్‌బీఐ బ్యాంక్‌ వరకు ఉన్న రోడ్డును ఇటీవల విస్తరించారు. ఈ సమయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోడ్డు పనులు ఇష్టం వచ్చినట్లు జరిగాయి. గ్రామ బస్టాండ్‌ చౌరస్తాలో రోడ్డు మధ్యలోనే గేట్‌ వాల్వ్‌ ప్రమాదకరంగా ఉంది. అధికారులు ప్రత్యామ్నాయంగా పైప్‌ లైన్‌ ఏర్పాటు చేయకపోవడం, ఈ గేటు వాల్వ్‌ను పక్కకు జరపకపోవడంతో గుంత అలాగే మిగిలిపోయింది. ఈ చౌరస్తాలో గతంలో ఉన్న రహదారి కన్నా నూతనంగా ఏర్పాటు చేసిన రహదారి దాదాపు నాలుగు, ఐదు ఫీట్ల మేర ఎత్తులో ఉంది. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగే ఈ ప్రాంతంలో రహదారి ఇంత ప్రమాదకరంగా మారినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం లేదు. ప్రధానంగా ఈ రహదారి పనులు చేపట్టిన ఆర్‌అండ్‌బీ అధికారులు తూతూ మంత్రంగా పనులు చేపట్టి వదిలేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

16న ధర్మసమాజ్‌ పార్టీ ఆవిర్భావ సభ



తిరుమలగిరిలో మాట్లాడుతున్న నాయకులు

తిరుమలగిరి : ఈ నెల 16న నల్లగొండలో జరిగే ధర్మ సమాజ్‌ పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు పేరాల శ్రీనివాస్‌ కోరారు. ఆదివారం తిరుమలగిరిలో అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో పది శాతం లేని వెలమ, రెడ్ల రాజ్యాన్ని దింపి 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజ్యాన్ని నెలకొల్పేందుకు ధర్మ సమాజ్‌ పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. ఆయన వెంట కొమ్ము యాకన్న, రాజు, సురేష్‌, రామ్మూర్తి, వినోద్‌, త్రివేణి, మహారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న మీలా మహదేవ్‌

భానుపురి : ఆర్యవైశ్య కార్పొరేషన్‌ ఏర్పాటు చేయాలని సూర్యాపేట ఆర్యవైశ్య కార్పొరేషన్‌ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి ప్రారంభించి పట్టణంలోని పలు వీధుల గుండా వెళ్లి గాంధీ విగ్రహం వద్ద ముగించారు. ఈ కార్యక్రమంలో కర్నాటి కిషన్‌, బొమ్మిడి లక్ష్మీనారాయణ, మీలా మహదేవ్‌, కక్కిరేణి శ్రీనివాస్‌, కలకోట మహంకాళి, సోమయ్య, లక్ష్మయ్య, పసుమర్తి కృష్ణమూర్తి, బెలిదే శ్రీనివాస్‌, వెంపటి శబరీనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్‌ సేవలు అభినందనీయం



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న వైద్యురాలు ప్రమీల శ్రీపతిరెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లం

కోదాడఅర్బన్‌ : విద్యా, వైద్య సామాజిక రంగాల్లో వాసవీ క్లబ్‌ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ అన్నారు. ఆదివారం పట్టణంలో వాసవీ క్లబ్‌ కోదాడ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన రమేష్‌ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యా, వైద్యం ఖరీదైన ఈ రోజుల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పేద, మధ్య తరగతి ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. కోదాడ వాసవీ క్లబ్‌ సేవారంగంలో జిల్లాలో అగ్రస్థానంలో నిలవాలన్నారు. వాసవీ క్లబ్‌ తమ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించిన ఐపీసీ ప్రోగ్రాం చైర్మన్‌ చల్లా విజయ్‌శేఖర్‌తో పాటు వాసవీక్లబ్‌ కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. వైద్య శిబిరంలో రమేష్‌ ఆస్పత్రికి చెందిన డాక్టర్లు అవినాష్‌, గోపాల్‌దత్త రోగులకు బీపీ, షుగర్‌, హృద్రోగ సమస్యల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ వైద్యులు డాక్టర్‌ ప్రమీల శ్రీపతిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, వాసవీ క్లబ్‌ కార్యవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైభవంగా బోనాల పండుగ



సూర్యాపేటలో బోనాలతో వెళ్తున్న మహిళలు



సూర్యాపేటలో శివసత్తుల సందడి..



ఆత్మకూర్‌ (ఎస్‌) : ఇస్తాళపురంలో..



చివ్వెంలలో..



తుంగతుర్తి : కొత్తగూడెంలో..



అర్వపల్లి : కోడూరులో..



తుంగతుర్తిలో..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరు, లోయపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నాగారం : మండలంలోని పసునూర్‌లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు.

ఆత్మకూర్‌ (ఎస్‌) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా బోనాల పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

నూతనకల్లు : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

తుంగతుర్తి : తుంగతుర్తి మండలంలోని తుంగతుర్తి, కొత్తగూడెం, అన్నారం, తూర్పుగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్‌, వైస్‌ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, సర్పంచ్‌లు నకిరేకంటి విజయ్‌, మిట్టగడ్పుల అనోక్‌, గుజ్జ పూలమ్మ, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్‌ : మండల పరిధిలోని దోసపహాడ్‌ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్‌, మేకల శ్రీను, శ్రీనివాస్‌, జగన్‌ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ ముత్యాలమ్మ దేవతకు బోనాల్లో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని రెడ్డిగూడెం, గుమ్మడవెల్లి, గోరెంట్ల, పోలుమల్ల గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ, మహంకాలమ్మకు నైవేద్యం చెల్లించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా బండ్ల పండుగ

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో మారెమ్మ(బండ్లపండుగ) పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భం ప్రజలు, రైతులు భక్తి శ్రద్ధలతో తమ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లను అలంకరించి డప్పుచప్పుళ్లతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మారెమ్మ దేవాలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదక్షిణ నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకొని బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ బోయిని శోభలింగమల్లు, ఎంపీటీసీలు ఈరేటి స్వప్నఅంజయ్య, వడ్డే పరశురాములు, ఉప సర్పంచ్‌ ఈదుల కిరణ్‌కుమార్‌, భక్తులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌ : దోసపహాడ్‌లో..



నాగారం : పసునూర్‌లో..



నాగారం : వర్ధమానుకోటలో బండ్ల ఊరేగింపు..



నూతనకల్లులో బోనాలను ఎత్తుకెళ్తున్న మహిళలు



మద్దిరాలలో..

వరి నాట్లకు ఉత్తరాఖండ్‌ కూలీలు

- ఎకరాకు రూ.5వేల చొప్పున కూలి
- తుంగతుర్తి ప్రాంతానికి రావడం ఇదే మొదటిసారి



తుంగతుర్తిలో వరి నాట్లు వేస్తున్న ఉత్తరాఖండ్‌ కూలీలు



తుంగతుర్తిలో నారు తీస్తున్న కూలీలు

తుంగతుర్తి : ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా తుంగతుర్తి నియోజకవర్గంలోని పలు మండలాల్లో వరినాట్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. గతంలో ఇప్పటికే వరి నాట్లు పూర్తయి రైతులు మొదటి దఫా ఎరువులు వేసేవారు. కానీ ఈసారి ఇంకా వరినాట్లే పూర్తి కాలేదు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తుంగతుర్తి ప్రాంతంలో కూలీల కొరత ఉండడంతో వరి నాట్లు వేయడం సాధ్యం కాదని తెలుసుకున్న రైతులు ఉత్తరాఖండ్‌ రాష్ట్రానికి చెందిన కూలీలను రప్పించారు. మండల కేంద్రానికి సుమారు 21 మంది ఉత్తరాఖండ్‌ కూలీలు వరినాట్ల కోసం వలస వచ్చారు. వీరు ఎకరాకు 5000 రూపాయల చొప్పున తీసుకుని వరి నాట్లు వేస్తున్నారు. ముఖ్యంగా మగవారు సైతం వరి నాట్లు వేయడం గమనార్హం. తెలంగాణ ప్రాంతంలో ఆడవారు మాత్రమే వరి నాట్లు వేస్తారు. కానీ ఉత్తరాఖండ్‌ కూలీలు మగవారు, ఆడవారు కలిసి నాట్లు వేస్తున్నారు. వీరి వరి నాటు పద్ధతి డ్రమ్‌ సీడర్‌ మాదిరిగా ఒకే లైన్లో ఉంటుంది. ఈ కూలీలు ఉదయం 6 గంటల నుంచి వరి నాట్లను ప్రారంభించి రాత్రి 7గంటల వరకు పనిచేస్తారు. గతంలో ఇక్కడి కూలీలు తెనాలి, విజయవాడ, ఆంధ్ర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. కానీ గత రెండుమూడేళ్ల నుంచి తుంగతుర్తి నియోజకవర్గానికి కాళేశ్వరం జలాలు వస్తుండడం, వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో బీడు భూములు సైతం సాగులోకి వచ్చి వరిసాగు పెరిగింది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా కూలీలు వరి నాట్లు వేయడానిక తుంగతుర్తి ప్రాంతానికి వస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటాం



మా ఉత్తరాఖండ్‌ రాష్ట్రంలో వరి నాట్లు జూన్‌ నెలలోనే పూర్తవుతాయి. దీంతో తాము ఒక బృందంగా ఏర్పడి కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ లాంటి రాష్ట్రాలకు వరి నాట్లు వేయడానికి వలస వెళుతుంటాము. ఆడ, మగ తేడా లేకుండా అందరం కలిసి కూలీ పనులు చేస్తుంటాము.
– కంగస్‌, కూలీ, ఉత్తరాఖండ్‌

కూలీల కొరతతో..

ఇటీవల కురిసిన వర్షాలకు నాట్లు వేయడానికి కూలీలు దొరకడం లేదు. ఉత్తరాఖండ్‌ కూలీలు వచ్చి నిజామాబాద్‌ జిల్లాలో నాట్లు వేస్తున్నారని తెలిసి రైతులందరం కలిసి వారిని సంప్రదించాం. నాట్లు వేయడానికి తీసుకొచ్చాం.
– దేవ, రైతు, తుంగతుర్తి

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

నడిగూడెం : గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామీణ వైద్యుల సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు అండగా ఉంటుందని, గ్రామీణ వైద్యులు కూడా ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. అనంతరం ఖమ్మం పట్టణానికి చెందిన కార్తికేయ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీజనల్‌ వ్యాధులపై డాక్టర్‌ బికె.ప్రసాద్‌ అవగాహన కల్పించారు. అనంతరం గ్రామీణ వైద్యుల సంఘం మండల నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్‌, డాక్టర్‌ బ్రహ్మం, మండల అధ్యక్షుడు ఏ.శ్రీరాములు, సహ అధ్యక్షుడు కె.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.సైదులు, కోశాధికారి వి.సైదులు, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బి.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్‌ కార్యదర్శి కె.గురుస్వామి పాల్గొన్నారు.